# అనుతాపం

రాముకు మెలుకువ వచ్చేసరికి ఇంక పూర్తిగా తెల్లవారలేదు. గడియారం వంక చూచాడు. అయిదున్నర! ఒకమారు గదంతా కలయచూచాడు: చుట్టూ పక్కలు పరుచుకుని ఎవరెవరో పడుకుని వున్నారు. పక్కగదిలో నుంచి తల్లి మాటలు వినవస్తున్నాయి. ఇంత పొద్దున్నే ఎవరితో మాట్లాడుతోంది?

"నువ్వేం హడావుడిపడిపోయి హైరాణా అయిపోకు అక్కయ్యా. రెండు రోజులు వుంటాం గదా అన్నీ తీరికగా చూచుకోవచ్చు" అంటోంది ఒక ఆడగొంతు.

"అప్పుడే బేరం మొదలుపెట్టావా నిర్మలా? అయినా ఒక్క నిద్రకూడా చేయనేలేదు," అంటూంది రాము తల్లి సునంద.

"అదికాదు అక్కయ్యా. నేను ఇలా అంటున్నానని నీవేమీ మనసులో కష్టం పెట్టుకోకు. నీకు వచ్చిన యిబ్బందికి మేము ఎంత కుమిలిపోతున్నామో మాటల్లో చెప్పడం చేతకాదు."

"నాకేం కాలేదు. నిక్షేపంగా వున్నాను. నన్ను గురించి ఎవరూ బెంగపెట్టుకోకండి. ఆ భగవంతుడు నా నుదుట యేం వ్రాస్తే అదే అవుతుంది. అంతకంటే నేను ఎప్పుడూ ఎక్కువ యేమీ ఆశించను."

"నీ గుండె నిబ్బరం అందరికీ వుంటే బాగుండును" అంది ఆ కొత్త గొంతు మళ్ళీ.

రాము గుర్తుకు తెచ్చుకుందుకు ప్రయత్నిస్తున్నాడు

అవును, అర్ధరాత్రి పూట ఎవరో తలుపుతట్టారు. మెలుకువ వచ్చి తల్లిని లేపాడు.

"పడుకోరా. మన యింట్లో కాదు. నీకూ మీ నాన్నకూ ఎప్పుడూ ఏవో చప్పుళ్ళు వినిపిస్తూనే వుంటాయి—" అని విసుక్కుంది తల్లి, ముందు.

తరువాత రెండు మూడు దెబ్బలు తలుపుమీద పడడంతో, ఆమె లేచి తలుపుతీసింది, 'ఎవరూ?' అంటూ.

తన తల్లి వయసే వున్న ఆమె ముందులోపలకు వచ్చింది.

"నువ్వా- నిర్మలా- రండి ... రండి మరిదిగారూ, పిల్లలూ వచ్చారా, రండి, లోపలకు. అక్కడ గుమ్మంలో నిలబడిపోతారేం- "అని తల్లి సంబరంగా అనడం రాముకు గుర్తువచ్చింది.

ఆ నిర్మల అనే ఆవిడ వెనకాల, ఓ మగాయన- యిద్దరు పిల్లలు బిల బిల లోపలకు వచ్చారు.

"అనుకోకుండా అర్ధరాత్రి వచ్చిపడ్డాం. మీకు నిద్రాభంగం చేశాం" అన్నాడాయన.

"చాల్లెండి. ఎవరో పరాయివాళ్ళకు చెప్పినట్లు చెబుతున్నారు" అంది సునంద.

"రాత్రంతా స్టేషన్లో వుండి తెల్లవారిన తరువాత యిక్కడకు వద్దామన్నారు, మీ మరిదిగారు. నేనే మా అక్కయ్య మనం అలాచేస్తే చంపేస్తుందని తీసుకువచ్చాను" అంది నిర్మల అనే ఆమె.

"మంచి పనిచేశావు, నీ కడుపు చల్లగా. పద, పిల్లలకు అన్నం పెడతాను. ముందు అందరూ కాళ్ల చేతులు కడుక్కోండి" అంది సునంద.

"నువ్వు అలా అంటావని నాకు తెలుసు. అయినా ఈ విషయంలో నన్ను క్షమించాల్సిందే. అర్ధరాత్రి వచ్చింది కాక, నీకు వండిపెట్టు అంటూ శ్రమ యివ్వదలచుకో లేదు. స్టేషన్లో దొరికినవన్నీ పీకలదాకా మెక్కి మరీ వచ్చాం. పడుకుని నిద్రపోయేందుకు చోటు చూపించు, చాలు. తెల్లవారిన తరువాత మామూలు మర్యాదలన్నీ చూచుకోవచ్చును" అంది నిర్మల.

తల్లి వాళ్ళందరికీ పడకల ఏర్పాట్లు చూడడం కలగా గుర్తు వుంది రాముకు. ఈ సందడిలో తను మంచం మీదనుంచి లేచి మరోచోట పడుకోవలసి వచ్చింది కూడాను....

"అప్పుడే నిద్ర లేచిపోయావేంరా, రామూ-" అంది నిర్మల, అతను లోపలకు వెళ్ళడంతోటే.

"నయం, ఈ రోజు యింకా ఆలస్యం అయింది· రోజూ అయిదుగంటలకల్లా లేచిపోతాడు. పొద్దున్నే పాఠాలన్నీ చదువుకుంటే గాని ముఖమైనా కడుక్కోడు-" అంది తల్లి.

"రాత్రి నిద్రపోతున్నావు. అందుకని ఎక్కువ పలుకరించలేదు. బాగా చదువుకుంటున్నావా?" అంది నిర్మల రామును.

రాము తల ఊపాడు.

"ఎన్నో క్లాసు?"

"ఆరు"

"భేష్- తమ్ముళ్ళు గుర్తున్నారా నీకు?"

రాము మళ్ళీ తల ఊపాడు, ఏం చెప్పాలో తెలియక.

ఎవరిని గురించి అంటూంది ఈమె?

"వాళ్ళను కూడా లేపు. ఆడుకుందువుగాని-"

"ఇప్పటినుంచే ఎందుకులే లేపటం. పడుకోనీ పాపం. రాత్రంతాసరీగా నిద్రలేదు గదా. ఏడు గంటలయ్యాక చూచుకోవచ్చు" అంది సునంద.

రాము కాలకృత్యాలు ముగించుకుని మళ్ళీ వరండాలోనికి వచ్చేసరికి ఎండపొడలు లోపలకు రాసాగాయి.

"సునందా- సునందా-" అని పిలుస్తున్నారు, నాన్న గదిలోనుంచి.

అమ్మ గబగబ నాన్న గదిలోనికి వెళ్ళింది.

"లేచారా?.... ఇదుగో, వీళ్లు.... రాత్రి మా చెల్లెలు, మరిదీ, పిల్లలూ వచ్చారు-"

"ఎవరు?"

"అదేనండీ- నిర్మల- సదానందం- పిల్లలూను!"

"సదానందమా? ఏదీ రమ్మను-"

నిర్మల లోపలకు వచ్చింది.

"నమస్కారం బావగారూ. కులాసాగా ఉన్నారా?" అంది.

"రామ్మా రా. అదే కులాసా. ఇంకా నడక చేతకావడం లేదు. లేచి కూర్చోగలుగుతున్నాను. ఏడీ, సదానందం?"

"ముఖం కడుక్కుంటున్నారు. వస్తారు-" అంటూ వుండగానే, సదానందం లోపలకు వచ్చాడు.

"రావోయ్- రా- కూర్చో. మీరు అంతదూరం నుంచి రావడం నాకు చాలా సంతోషంగా వుంది. రెండేళ్ళు అయిందిగదూ చూచి- బాగావున్నారా? ఇంక ఏమిటి కబుర్లు?"

"అ....అ....కులాసాగానే వున్నాం, మూర్తిగారూ. మీరిలా మంచంలో పడిపోవడం మాకు చాలా విచారంగా వుంది. ఏమంటారు డాక్టర్?"

"డాక్టర్లు అనడానికేం వుంది. నాకూ తెలుస్తూనే వుంది. ఇంకో నాలుగు అయిదు నెలల్లో బాగా తిరగ గలుగుతాను. ఆఫీసుకు వెళ్ళగలుగుతాను- అనుకుంటున్నాను."

"అసలు ఎట్లా జరిగింది యిదంతా"- అంటూ డొంక కదిలించాడు సదానందం.

మూర్తికి ఎంత యిష్టం లేకపోయినా వెనకటి కథంతా చెప్పవలసి వచ్చింది. మధ్య సునంద మాటలు అందిస్తోంది. రాము కూడా తాపీగా వింటూ కూర్చున్నాడు. అంతా తెలిసిన వ్యవహారమే.

ఒకరోజు స్కూలునుంచి యింటికి రావడంతోటే, అమ్మ దగ్గరకు తీసుకుని తల నిమురుతూ "మెల్లిగా లోపలకు వెళ్ళు. నాన్నగారి దగ్గర కూర్చో బాబూ-" అంది.

"నాన్నగారు ఆఫీసుకు వెళ్ళలేదా? ఇంట్లోనే వున్నారా?" అన్నాడు రాము యూనిఫాం సర్దుకుంటూ.

"ఆఫీసునుంచి మధ్యలోనే వచ్చేశారు. సుస్తీగా వున్నదని లోపల గదిలో పడుకుని వున్నారు- దగ్గరకు వెళ్ళి కూర్చో, ఏం మాట్లాడించకు"- అంది అమ్మ.

చూడగానే నాన్న కళ్ళు తడిగా అవడం గమనించాడు. నాన్న మాట్లాడడం లేదు. ముఖంవంక చూస్తూ దిగులుగా కూర్చున్నాడు. ఏమయింది నాన్నకు? దగ్గరే కూర్చున్నా.... బుజాలమీద చేతులు వేయడంగానీ, దగ్గరకు తీసుకోవడం గానీ చేయడం లేదు.

తరువాత .... తరువాత తనకు తెలిసింది. నాన్నకు పార్షియల్ పెరాలిసిస్- వచ్చిందని, సంవత్సరంపాటు ట్రీట్‌మెంట్ చక్కగా జరిగితే మళ్ళీ మామూలు మనిషిగా తయారవుతారట.

"మనిషికి యే క్షణాన యేం జరుగుతుందో చెప్పలేం గదా!" అన్నాడు సదానందం- సుస్తీ వివరాలన్నీ విన్న తరువాత.

"మనం అనుకుంటాంగాని జరగకూడనిది యేదీ జరగదు, సదానందం ఎంత ప్రాప్తమో- అంత!"

"మీరిట్లా వేదాంతం కబుర్లు చెబుదురుగాని- చూడండి, మా అక్కయ్య ఎట్లా నీరసించి పోయిందో బెంగతో"- అంది నిర్మల.

"ఎందుకూ బెంగ? అక్కడికి అదృష్టవంతులం తల్లీ. నయమైపోతుందని భరోసా చిక్కింది గదా" అంటూ సునంద ముఖం పక్కకు తిప్పుకుని పమిట చెంగుతో ముఖం, కళ్ళు తుడుచుకుంది.

"ఈ మాటలకేం గాని మాకు కాఫీ యివ్వవూ, సునందా"- అన్నాడు నాన్న.

సునంద లోపలికి వెళ్ళిపోయింది.

తరువాత మూర్తి అన్నాడు.

"మొదటి మూడు నెలలు చాల అవస్థలుపడ్డాం. డాక్టర్లు పరీక్షలు, మందులు, ఒకటే చికాకు. ఒక క్షణంలో ఉన్నట్లు మరుక్షణంలో వుండేది కాదు. నిజంగా అప్పుడు నిలదొక్కుకుని ధైర్యంగా నిలబడింది సునంద. నన్నుకూడా సముదాయించేది. సునంద లేకపోతే నేను యేమయిపోయేవాడినో! ఈ మాత్రం యిప్పుడు హాయిగా కూర్చోగలుగుతున్నానంటే- మాట్లాడుతున్నానంటే అంతా మీ అక్కయ్య సేవల ఫలితమేననుకో."

సునంద అందరికీ కాఫీ పట్టుకువచ్చింది.

వాళ్ళు యింకా మాట్లాడుకుంటూ ఉండగానే పిల్లలు లేవడం, వాళ్ళకి స్నానపానాలు- పూర్తి అయ్యాయి.

సదానందం చెప్పాడు- "ఎప్పటికప్పుడు రావాలంటే సెలవు దొరక్క పోవడం- యేవేవో పనులతో సతమతం-చికాకు-రెండురోజులపాటు యిప్పుడు అవకాశం దొరికింది. ఎగిరిపడ్డాం అనుకోండి."

"అవును మరి! ప్రయాణం అంటే మాటలా? ఎన్ని సర్దుకోవాలి! ఎంత చూచుకోవాలి!"

"అయినా ఎప్పటికప్పుడు మీ వివరాలు తెలుసుకుంటూనే వున్నాం. దారిలో రెండురోజులు మాత్రం బ్రేక్ చేయటానికి కుదిరింది. రేపు సాయంకాలం మళ్ళీ రైల్లో పడాలి."

తొమ్మిది గంటలు అవుతూ వుండగా రాముని పిలిచింది సునంద.

"చూడరా పక్కవీధిలో హొటలుకు వెళ్ళి తాజాగా తయారయిన

స్వీటు, దోసెలు పట్టుకురా. వాళ్ళంతా కనకదుర్గ గుడికివెడదాం అంటున్నారు. నీకూ బడిలేదుగా కావాలంటే నువ్వూవెడుదువుగాని ..."

రాము తల్లి అందించిన డబ్బు జేబులో పెట్టుకుని సంచి చేతిలోనికి తీసుకున్నాడు.

వాళ్ళ యింటికి పై వీధిలోనే తగుమాత్రం 'హోటలు' వుంది. ఎప్పుడయినా తినుబండారాలు కావాలనుకున్నప్పుడు అక్కడనుంచి తెచ్చుకోవడం అలవాటు. రాముకు ఈ పని సులువు. పైగా ఆ హోటలుకు వెళ్ళటానికి వీధంతా చుట్టుకుంటూ వెళ్ళవలసిన పనిలేదు. ఎదురుగుండా వున్న యిళ్ళ వరుసలో మూడో ఇల్లు- మరమ్మత్తుల్లో వున్నది- ఆ యింటి గోడలు సగం కొట్టేసి కప్పుకూడ పడిపోయే స్థితికి తీసుకువచ్చారు. ఆ గోడల పక్కనుంచి సందుచేసుకు వెళ్ళడం భలే సరదాగా వుంటుంది. పదినిముషాల నడక-రెండు నిమిషాలలోనే పూర్తిచేసి దబ్బున వచ్చేసెయ్యవచ్చు. నాన్న సుస్తీ పడకముందు తనకు బజారు పనులు యిలా చెప్పేవారుకాదు. సాయంత్రం ఎప్పుడైనా షికారుకు తీసుకువెళ్ళేవారు. బడి- ఇల్లు తప్ప యితర 'నడక' యేమీ వుండేది కాదు. అందుచేత రాముకు ఇలాంటి పనులు చేయడం తాలూకు కొత్త సరదా యింకా తీరలేదు.

"దగ్గరే గదా అని ఆ పాడుపడిన యింటిలోనుంచి వెళ్ళకు సుమా! ఎప్పుడు యేదూలం విరిగి కిందపడుతుందో తెలీదు"- అంది సునంద.

"ఫరవాలేదమ్మా జాగ్రత్తగా చూచుకుని వెడతాను."

"ఎందుకు వచ్చిన బాదరబందీ బాబూ చుట్టూ తిరిగి వెడుదూ-"

"అలాగేలే అమ్మా-" అని రాము బయటకు వెళ్ళాడు. అలా అన్నాడే గాని రాము ఆపాడుపడిన యింటిలోంచే దూరుకుంటూ వెడదామని మనసులోనే నిర్ధారణ చేసుకున్నాడు. వాడు అలాగే వెడతాడని సునందకు తెలుసు. ఫరవాలేదు. ఒక్క ఆ నిమిషంలో ఏమయిపోతుందిలే అని భరోసా.

రాము బయటికి వెళ్ళిన రెండు నిముషాలలోనే వీధిలోంచి కలవరం వినిపించింది. ఏమిటది- ఏమిటది- అనుకుంటూ సునంద ఇంటిల్లిపాదీ బయటకు వచ్చారు. అప్పటికి వీధిలో పోగయిన ఇరుగు పొరుగువాళ్ళు చెప్పారు, పాడుబడ్డ యిల్లు దూలం విరిగికింద పడిందట!

సునంద గుండెలు గుభేలు మన్నాయి.

గబగబ వీధిలోనికి పరుగెత్తింది.

ఆ ఇంటిచుట్టూ అరవై డెబ్బయిమంది పోగయి వున్నారు. ఎవరికీ లోపలకు వెళ్ళిచూడటానికి భయం. దూరంగా నిల్చుని చోద్యంచూస్తున్నారు. సునంద లోపలకు చొచ్చుకుపోదామని ముందుకు దూకింది.

"మీకేమైనా మతిపోయిందా? ఏం చూస్తారు లోపల?" అన్నారు పక్కవాళ్ళు.

"మా బాబు యిటుపక్క వెళ్ళాడు"- వాక్యం పూర్తి చేయలేకపోయింది సునంద. కుప్పగా కూలిపోయింది. నిర్మల- యితరుల సాయంతో ఆమెను యింటికి తీసుకువచ్చింది.

సునంద సేద తీర్చుకుని చెప్పేంతవరకు ఆమె మనసులోని మాట- కలవరం- యేమిటో ఎవరికీ అర్థం కాలేదు. సదానందం, 'నేను చూచి వస్తా' నంటూ వీధిలోనికి వెళ్ళాడు. అప్పటికే రాము తినుబండారాల పాకెట్ సంచి బుజానికి తగిలించుకుని హుషారుగా యెదురు వచ్చాడు.

"నేను ఆ లోపలనుంచే దూసుకువెళ్ళాను. దూలం వంక చూచు కుంటూనే వెళ్ళాను. అప్పుడు యేమీ అప్పుడు యేమీ అవలేదు. తీరా వెనక్కు వస్తూ వుంటే రోడ్డుమీది జనం చెప్పారు- దూలం కూలిపోయిందని వీధంతా చుట్టూ తిరిగి వచ్చాను. అందుకని ఆలస్యం అయింది-" అన్నాడు రాము.

"బాబూ-" అంటూ కౌగలించుకు ఏడవసాగింది సునంద. "నా బాబుకు ఏం అవలేదు. ఆ భగవంతుడు దయామయుడు," అని భర్త దగ్గరకు వెళ్ళి కాస్సేపు కూర్చుంది.

"అయినా మన జాగ్రత్తలో మనం వుండాలిగదా. ఆ ఇంట్లోంచి వెళ్ళ వద్దని అమ్మ చెప్పినప్పుడు- అలా ఎందుకు వెళ్ళావు? దూకుడు పనులు చేసి అమ్మకు బాధ కలిగించకు, రామూ-" అన్నారు నాన్న.

రాము ఏమీ మాట్లాడకుండా వుండిపొయ్యాడు. జరగని దానికోసం అందరూ ఎందుకు బాధపడతారో సుతరామూ అర్థంకాలేదు వాడికి.

కల్లోలం అయిన వాతావరణం మళ్లీ సర్దుకుని మామూలుగా తయారవ టానికి గంట టైం పట్టింది.

"కృష్ణానదిలో స్నానం శేసి, ఆపైన కనకదుర్గ గుడికి వెళితే మంచిది గదండీ-" అన్నాడు సదానందం, మూర్తిని సలహా అడుగుతున్నట్లు.

"ఇందులో మంచి-చెడు ఏమున్నాయి? రెండూ పక్క పక్కనేగదా? స్నానం చేసి వెళ్ళండి. మళ్ళీ ఎప్పుడు వస్తారో ఈవూరు. అందుబాటులో వున్న పుణ్యం కాదనుకోవడం ఎందుకు?" అన్నాడు మూర్తి.

అక్కడికి ఆ విషయం స్థిరం అయింది.

"వాళ్ళతోపాటు తోడుగా నేనూ వెడతాను-" అంది సునంద, "రాము మీకు తోడుగా వుంటాడు."

"నన్నుగూడ కనకదుర్గ గుడికి వెళ్ళమన్నావుగా, యిందాక. నేనూ వస్తాను" అన్నాడు రాము.

"నీకు పొద్దున్నే ఎంత పెద్ద గండం తప్పిందో అర్థం కాదు. నాన్నగారికి తోడుగా వుండిపో నాన్నా. మేం అరగంటలో వచ్చేస్తాంగా."

రాము ముఖం ముడుచుకున్నాడు.

నాన్నగారికి తోడు వుండకుండా వెళ్ళడం యిష్టం లేదు.

అయితే అందరితో కలిసి సరదాగా నదీస్నానం, దేవాలయ దర్శనం చేయటానికి.... మనస్సు ఉరకలు వేస్తుంది.

అమ్మ చెప్పిన మాట కాదనటానికి ధైర్యం లేదు.

అమాయకంగా ముఖం పెట్టి తండ్రివంక చూచాడు.

మూర్తి వాడి కళ్ళలోని లాలస కనిపెట్టాడు.

"పోనీ వాడిని కూడా తీసుకువెళ్ళండి. నాకు తోడుగా వుండాల్సిన అవసరం ఏముంది?" అన్నాడు మూర్తి.

సునంద అతనివైపు అర్థయుతంగా చూచింది.

"ఫరవాలేదు. అక్కయ్యా వాడినీ రానివ్వు. కుర్రాళ్లు సరదాపడుతున్నారు. జాగ్రత్తగా వచ్చేద్దాంగా-" అంది నిర్మల.

"అంతగా అయితే నేను అన్నగారికి తోడుగా వుంటాను. మీరందరూ వెళ్ళండి-" అన్నాడు సదానందం.

"అబ్బే అలా ఎందుకయ్యా, మీరందరూ వెళ్ళిరండి. నేను పేపర్ చదువుకుంటూ కూర్చుంటాను. నా పేపర్ రీడింగ్ అయేటప్పటికి మీరు రానే వస్తారు" అన్నాడు మూర్తి.

అందరూ పది నముషాలలో తెమిలారు.

రాము, నిర్మల కొడుకులు యిద్దరు- ఒక జట్టుగా ముందు బయలు దేరారు.

వాళ్ళకు రెండు అడుగుల దూరంలో వెనుకగా నిర్మల, సునంద, సదానందం నడుస్తున్నారు.

"పది నిముషాలు నడిస్తే చాలు. కృష్ణానదీ తీరం వస్తుంది. మరో పది నిముషాలలో స్నానం ముగించుకుని, దేవాలయ మెట్లు ఎక్కడం ప్రారంభించవచ్చు."

"దేవాలయంలో యెంత క్యూ వుంటుందో! ఎప్పటికి దేవి దర్శనం అవుతుందో! ఈ రోజు సెలవు దినం గనుక యాత్రికులు ఎక్కువగా వుంటారేమో!"

"అబ్బే ఆలస్యం అవదు. అంతగా అయితే అరగంట. అంతకంటే మరేం ఎక్కువకాదు."

"ఇంటికి వెళ్ళడంతోటే అందరికీ భోజనాలు పెట్టేయవచ్చు. వంటంతా పూర్తిచేసింది మాటల మధ్యలోనే సునంద. ఒక్కపావుగంటలో అప్పడాలు, వడియాలు వేయించేసి, తిరుగమాతలు సరిచూచి వడ్డించేసెయ్యవచ్చును. కొండ ఎక్కిదిగేటప్పటికి నకనకలాడుతూ వుంటారు. కుర్రవాళ్ళు...." అనుకుంటోంది సునంద.

కబుర్లు చెప్పుకుంటూ నడుస్తున్నారు. ఎండ మూలంగానేమో, రోడ్డు మీద ఎక్కువ జనసంచారం లేదు.

రాము తమ్ముళ్ల నిద్దరినీ రోడ్డువారగా నడిపిస్తున్నాడు. వాళ్ళతో యేవో మాటలు చెబుతూ అతి జాగ్రత్తగా అడుగులు వేస్తున్నాడు. వెనుక నుంచి సదానందం వాళ్ళను పరికిస్తూనే వున్నాడు.

ఓ సందు మలుపు తిరుగుతూ వుండగా.... పక్కనుంచి ఎలావచ్చిందో ఓ ఆటోరిక్షా రామును దూసుకుని మరీ ముందుకుపోయింది.

సదానందం, సునంద పెద్దగా అరిచారు.

రాము కింద పడిపోయాడు.

నిర్మల వాడిని లేవదీసి దుమ్ము దులిపింది.

ఎదురుగా వస్తున్నవాళ్లు ఆటోరిక్షాను అటకాయించి ఆపుచేశారు.

ఆటో అతను తన తప్పేం లేదనీ, అయినా ప్రమాదం యేమీ జరగ గనుక తనను వదలిపెట్టమనీ గొడవ పెడుతున్నాడు.

"జరగలేదు గనుక సరిపోయింది. అయినా ఆటోవాళ్ళ అగడాలకు మితం లేకుండా పోతోంది. ఏ మాత్రం 'రోడ్ సెన్స్' లేకుండా బండి తోలుతారు. కుర్రవాడికి యేవయినా అయితే-" అంటూ చుట్టూ చేరినవాళ్ళు రకరకాలుగా మాట్లాడుతున్నాడు.

'పక్కనుండి దూకుడుగా ఆటో దూసుకుపోవడంతో భయపడిపోయి కిందికి వరిగాను. ఆటో నాకేం తగల్లేదు. నేను కిందపడటానికి ఆటోకారణం కాదు,' అని తేల్చాడు రాము.

ఆ సన్నివేశానికి సునంద గజగజ వణికిపోయింది.

రామును దగ్గరకు తీసుకుని తల నిమిరింది.

సదానందం ఆమెకు యెంతో ధైర్యం చెప్పి ముందుకు నడిపించాల్సి వచ్చింది.

"ఈ రోజు రెండు గండాలు గడిచాయి- నా బాబుకు. భగవంతుడా! మమ్మల్ని యిలాగే చల్లగా చూడు. తెలిసి తెలిసి నేను ఎవరికీ ఎలాంటి అపకారం చేయలేదు-" యిలా తనలో తాను గుణించుకుంటూ పైకి మాత్రం తన బెంబేలు, భయం.... యేమాత్రం కనిపించనీయకుండా జాగ్రత్తపడుతూ నడుస్తోంది సునంద.

సదానందం రాము చేయిపట్టుకు నడిపిస్తున్నాడు.

మనసులో యేదో బెదురు.

ఫలానా అని చెప్పటానికి లేకుండా వుంది.

అందరి మనసులూ అతలాకుతలం అయిపోయినాయి.

కాని మొండిగా భగవంతుడిదే భారం అన్నట్లుగా నడుస్తున్నారు.

నదిలో స్నానం చేస్తున్నప్పుడు తీసుకోవలసిన బాధ్యతలన్నీ చెప్పింది నిర్మల. పిల్లలిద్దరికీ స్నానం చేయించి ఒడ్డుకు తీసుకువచ్చి వస్త్రతుడుస్తోంది. సునంద, రాము చేయిపట్టుకుని నదిలోనికి నడుస్తోంది. "ఎక్కువ లోతుకు వెళ్ళకు అక్కయ్యా, తొందరగా బయటపడండి, వెడదాం" అంటూంది నిర్మల వెనకనుంచి. "నది మంచి పొంగులో వుంది. బాగా ఈత కొట్టాలని వుంది నన్ను లోపలకు పోనివ్వు" అన్నాడు సదానందం.

"చాల్లెండి, మీ ఈత సరదాలు, మీరూను. త్వరగా తెమలండి-" అని మందలిస్తోంది నిర్మల. సునంద ఆకాశంలో తేజంగా వెలిగిపోతున్న సూర్యునికి నమస్కారం చేస్తూ నీళ్లలో తలముంచింది.

రాము ఆమె పక్కనే వున్నాడు. నీళ్ళలో సరదాగా కేరింతలుకొడుతూ ఆడుకుంటున్నాడు.

వెనకనుంచి ప్రవాహం దూసుకువచ్చింది. రాము ఉక్కిరిబిక్కిరి అయిపోయాడు. భయంతో వేసిన కేకకు సునంద నీళ్ళల్లోనుంచే తల పైకి ఎత్తింది. అప్పటికే కెరటం రామును లోపలకు ఈడ్చుకుపోయింది. సునంద వేసిన కేకలకు సదానందం ఉక్కిరిబిక్కిరి అయి నదిలోపలకు దూసుకు వెళ్ళాడు. నీళ్ళు రాముతో ఆటలాడుకోవడం ఆపేసి వాడిశరీరాన్ని యివతలకు తోసేసాయి. వేళ్ళాడిపోతున్న వాడిని బుజాన వేసుకుని మాత్రం తీసుకు రాగలిగాడు సదానందం, యింటికి.

రామును మూర్తి ఎదురుగా నేలమీద పడుకోబెట్టారు.

"రెండు గండాలు గడిచాయి. మూడోది వాడిని ముంచేసింది. పోనీ నన్ను తీసుకుపోగూడదూ-" అని సునంద ఒకటే యేడుపు. ఆమెను సము దాయించడం ఎవరికీ చేతకాకుండా పోతోంది.

'జరిగిపోయిన దానికోసం యేడవడం ఎందుకు సునందా నిలదొక్కుకో' అన్నాడు మూర్తి.

"ఈ ఆపద మేం మూట కట్టుకువచ్చినట్లున్నాం" అని నిర్మల గోల గోలగా యేడుస్తోంది.

"జీవితంలో ఎన్నో కష్టాలు ఓర్చుకున్నాను. ఇది మాత్రం నా వల్ల కాదు" అంటూంది సునంద.

"నావల్ల కాదంటే తీరిపోతుందా? మనిషి భరించలేనంత కష్టం-భగవంతుడు ఎప్పుడూ ఎవరికీ ఇవ్వడు అని నువ్వే అంటూ వుంటావుగా సునందా- నీ ధైర్యం అంతా యిప్పుడేమయింది" అన్నాడు మూర్తి దుఃఖంతో కూరుకుపోయి.

సునంద కళ్ళనీళ్ళు తుడుచుకుంది. రామువంక తదేకంగా చూచింది. ఆమె ముఖంలో హటాత్తుగా సాక్షాత్కరించిన గాంభీర్యానికి అందరూ ఆశ్చర్యపోయారు.

*